23. సర్వాంగములను, సర్వయింద్రియములను మానవుడు పనిముట్లవలె తలంచి తాను వేరని భావించవలెను.

24. అజ్ఞానము, అవిశ్వాసము, చపలచిత్తము, అహంకారములే మానవత్వమునకు మసిపూతలు. అట్టివారికి శాంతి మచ్చునకైనా వుండదు. వారికేకాక, చుట్టుముట్టువారికి కూడా అట్టివారితో అశాంతి, అసుఖం.

25. కర్తవ్య నిర్వహణమైన మానవసేవకూడా భగవత్ పూజయే.

26. వశమందులేని మనోశక్తి ఆత్మకు పరమశత్రువు.

27. భగవంతునియందు దృష్టిని నిలుపశక్తి లేకపోయిననూ, భగవత్ ప్రియమైన కర్మలను చేసిన ధన్యుడు కాగలడు.

28. ఐహిక బంధములకు మాయ కారణము. మాయకు కామము కారణము.

29. వివేక విజ్ఞానమే సత్వగుణము. భ్రమ, చపలచిత్తమే తమోగుణము. కామమే(ఆశ) రజోగుణము. మానవుని మంచిచెడ్డలకు గుణములే కారణములు.

30. ఆకాశమున వాయువు సదా యిమిడియుండునటుల భగవంతునియందు ప్రాణికోటి అంతయూ యిమిడియున్నది.

31. మానవుని హృదయమున యిమిడియున్న ఆత్మయే భగవంతుడు.

32. విశ్వమెల్ల భగవంతుని కరమక్షేత్రమో శరీరము ఆత్మకట్టి కర్మక్షేత్రము.

33. కష్టనష్టములు రావనుకోటము సోమరితనము. అవి రాకమానవు. అయితే, బగవదనుగ్రహమును పొందినవారికి అవి కాళ్లక్రింది నీరువలె కదలిపోవును.

34. చూపునకు అడ్డు తగలని కండ్లజోడు వలె బ్రహ్మ దృష్టికి అడ్డురాని సంసారమై వుండవలెను.

35. యుగములు, జగములే కదలుచుండగా క్షణభంగురమైన దేహమెంతటిది! ఇది నశించుటలో ఆశ్చర్యమేమి?

36. స్వచ్ఛప్రేమ హృయము కలవాడే సర్వేశ్వరునికి ప్రియుడు.

37. త్రిగుణాత్మక ప్రభావమే మానవుని కర్మ. అహంకారముచే భ్రమించి కర్మకు తానే కర్తయని భావించుచున్నాడు.

38. భగవంతుడే సమస్త జీవరాసులకు ఆది బీజము. జీవుల చైతన్యము అగ్నియందు తేజస్సు, నీటియందలి రుచి, వేదములందలి ఓంకారము, మానవుని పురుషత్వము, ప్రాణికోటియొక్క బుద్ధి, పరమార్థవిషయమునందలి జ్ఞానము భగవంతుడై వున్నాడు. దీనిని అనుభవమునకు తెచ్చుటే ఆదిస్థానమును చేరుట.